

'టిక్కా శంకరయ్య'లో రామారావు, కృష్ణకుమారి.

చిత్రసమీక్ష

టిక్కా శంకరయ్య

మనకి కేవలం హాస్యరసం ప్రధానంగా గల చిత్రాలు చాలా తక్కువ. హాస్యం ప్రధాన లక్ష్యంగా వుంచుకుని సకలరస భరితంగా నిర్మించే చిత్రాలు మరీ తక్కువ ప్రేక్షకులకి కావలసిన వినోదాన్ని మన నిర్మాతలు ఎంతవరకు అందిస్తున్నారు? అనే ప్రశ్నకి డి. వి. యస్. ప్రొడక్షన్స్‌వారి టిక్కా శంకరయ్య చక్కని సమాధానం చెబుతాడు!

రాణిని చూడ్డానికి వెళ్ళిన మోహన్ సుశీలను చూస్తాడు. ఆమెనే పెళ్ళి చేసుకుంటానంటాడు. అందుకు సిద్ధమై వచ్చినరోజున సుశీలకి లింగరాజుతో పెళ్ళయి పోయిందని వింటాడు. పెళ్ళి కాలేదనే యదార్థం తెలిసేటప్పటికి సుశీల దూరమై పోతుంది. అతను ఆమెని వెదుకుతూ శంకరయ్య స్థానంలో పిచ్చాసుపత్రికి వెళ్ళవలసివస్తుంది. టిక్కా శంకరయ్య తప్పించుకుని రాణితో ప్రేమకలాపాలు సాగిస్తాడు. అతని టిక్కా కుదిరేవరకు; మోహన్ విడుదలయ్యేవరకు ప్రేక్షకులకి పుష్కలంగా వినోదం లభిస్తుంది! మోహన్, శంకరయ్యలకు సంబంధించిన జన్మ రహస్యాలేమీ వుండవు గనక కథ కట్టుకథలా తోచదు. ఇద్దరి పెళ్ళిళ్ళతోనూ కథ సుఖాంతమవుతుంది!

అగ్రతారాబలం కంటికింపుగా వుండడం వల్ల కథలో కట్టుదిట్టాల గురించిన ప్రసక్తి అట్టే వుండదు. చిత్రం ఆద్యంతమూ రసవత్తరంగా వుండటానికి కారణం చిత్రీకరణలో తీసుకున్న జాగ్రత్త హాస్యానికి శృంగారం జోడించినందువల్ల చిత్రం మరింత ఆహ్లాదంగా తయారయింది. ప్రేక్షకుల్ని ఖుషీగా నంపించాలన్న నిర్మాతల లక్ష్యం నెరవేరింది!

శంకరయ్య, మోహన్‌ల పోలికలలో తేడా లేకపోయినా పాత్రలలో వైవిధ్యం బాగా కనిపిస్తుంది రెండు పాత్రల్ని పోషించడంలో యన్. టి. రామారావు ప్రతిభా విశేషాలు ప్రస్ఫుటంగా తెలుస్తాయి. మోహన్ పాత్రలో పద్మశ్రీ కనిపిస్తే, శంకరయ్యలో నటరత్న కనిపిస్తారు. కృష్ణకుమారి, జయలలితల నటనతో చిత్రం సర్వాలంకార సంశోభితమైంది. సుశీలగా కృష్ణకుమారి, రాణిగా జయలలిత పాత్రలకి నిండుజీవం పోశారు. మరో చెప్పతగినపాత్ర నాగభూషణంది. అక్కడక్కడ ఎబ్బెట్టుగా కనిపించినా అలాంటి మనుషులూ వుండక పోరు అనిపిస్తుంది. పద్మనాభం అందించిన హాస్యం చక్కిలి గింతలు పెడుతుంది. ఒక మంచిపాత్రను హాస్యయుతంగా పోషించి అల్లు రామలింగయ్య రక్తి కట్టించారు. తదితర ముఖ్యపాత్రలని సూర్యకాంతం, పద్మశ్రీ నాగయ్య, బాలకృష్ణ, శివరామకృష్ణయ్య, హేమలత, రేలంగి, రాజబాబు, రావికొండలరావు పోషించి చిత్రాన్ని సర్వాంగసుందరం చేశారు.

గంటవుండే పెళ్ళికొడుకు పెట్టె బేడా తెచ్చుకుంటాడా? లింగరాజులాంటి మనుషులుంటారా? ఒక సేవకుడితో హీరో అంతతీవ్రంగా పోరాడాలా? దేవయ్య కారును ఎలా నడపగలిగాడు? అనే ప్రశ్నలు ఉదయిస్తాయిగాని — ఇవి కథా సంవిధానంలో మరుగుపడడానికి అవకాశం లేకపోలేదు!

పాత్రకి తగిన నేపథ్య సంగీతం వివి

పించడం చిత్రంలో ఒక ప్రత్యేకత. పిచ్చాసుపత్రిలో నాటకం మరో ఆకర్షణ.

చిత్రం చివరివరకు హృద్యంగమంగా వుందీ అంటే అందుకు కారణం రచన. డి. వి. నరసరాజా ప్రశంసార్హులు అలానే కెమెరా వర్కు కూడా పకడ్బందీగా జరిగింది కన్నుల పండువగావున్న చిత్రీకరణకి సంగీతం వీనుల విందుచేసింది డి యోగానంద్ దర్శకత్వము, టి. వి. రాజు సంగీతమూ చిత్రం విలువని పెంచాయి.

ఆబాలగోపాలానికీ ఆనందం పంచి ఇవ్వగల ఈ చిత్రం మనకి వినోదచిత్రాలు లేనిలోటును తీరుస్తుంది నేటి ప్రజా జీవితానికి వ్యంగ్యప్రతిబింబంగా 'తిక్క శంకరయ్య'ను సృష్టించిన నిర్మాత డి. వి. యస్. రాజు అభినందనీయులు.

—సికరాజు ●



'నిలువుదోపిడి'లో జయలలిత.

మదరాసులో బస్సు-కళాశాలల తగాదాలు

ఒక సోమవారం సూర్యాస్తమయంతో మద్రాసులో కోలాహలం ఆరంభమయ్యింది 'బస్సు వారి సమ్మెట అన్నారు కొందరు ఏదో విద్యార్థులకూ వారికీ తగు వచ్చిందన్నారు అయితే మంగళవారం సూర్యోదయానికి యీ 'తగువు' ఆ స్థితిని దాటింది మంగళవారం మధ్యాహ్నమయ్యే సరికల్లా మద్రాసు లాటీ చార్జీలతోనూ, భాష్పవాయు ప్రయోగాలతోనూ కాల్పులతోనూ దద్దరిల్లి పోయింది ప్రాణభయంతో జనం అల్లల్లాడి పోయారు. దెబ్బలు తగిలి, ప్రమాద పరిస్థితిలో ఆసుపత్రిలో చేర్చబడిన వారిసంఖ్య నూటముప్ఫయి దాటిందన్నారు. మద్రాసు 'లా' కాలేజి విద్యార్థులు కొంతమంది కీల్‌పాక్ ఆసుపత్రిలో చేర్చబడ్డారనీ, వారి పరిస్థితి క్లిష్టంగా వుందనీ అన్నారు ఒక విద్యార్థి కాలు తీసెయ్యాలని డాక్టర్లు తెలియజేశారు

లా కాలేజి హాస్టలు భవనాన్ని మద్రాసు స్టేట్ ట్రాన్స్‌పోర్టు పనివారు సోమవారం రాత్రి 11 30 గంటలకు చుట్టు ముట్టారని, చుట్టుముట్టి, కర్ణకఠోరమైన భాషలో తిట్టారనీ అన్నార సయ్యద్ ఉమర్ అనే డ్రయివరుకి విద్యార్థులకి జరిగిన ఘర్షణలో ఉమర్ చనిపోయాడట దాంతో తిక్కరేగిన ట్రాన్స్‌పోర్టు పనివారు విజృంభించి, కాలేజి హాస్టళ్ళన్నీ చుట్టుముట్టారు విద్యార్థి అని అనుమానం వచ్చిన వారిని చితక్కొట్టారు మద్రాసు మెడికల్ కాలేజి హాస్టలు భవనంలోకి యీ పనివారు ప్రవేశించి, భవనం క్రిందిభాగంలో వున్న గదుల్లోకి జొరపడి, అందిన విద్యార్థులను కర్రలతోనూ, రాళ్లతోనూ క్షమా, ధర్మం లేకుండా కొట్టి, వారి పుస్తకాలు, రికార్డులు, రేడియోలు, ట్రాన్సిస్టర్లు, మంచాలూ, కుర్చీలూ అన్నీ సర్వనాశనం చేసి, హాస్టలు లాండ్రికి, క్యాంటీన్ శాలకి నిప్పంటించారట కరంటు ట్రాన్స్‌ఫార్మర్‌కి కూడా నిప్పంటించ ప్రయత్నించారట

ఒక యం బి బి యస్ విద్యార్థిని రోడ్డులాంతరు స్తంభానికి కట్టి కొట్టారట ఆ దారిన పోయే పాల లారీని ఆపి, ఆ పాలన్నీ నేలమీద పారబోసి, సీసాలన్నీ పగలకొట్టారట ఈ దురంతాన్ని నిగ్రహించలేని విద్యార్థులు ఎదురుతిరిగి సోడా బుడ్ల తోనూ, రాళ్ళతోనూ వాళ్ళా కొట్టారట ప్రభుత్వపు బస్సులను తమ యిష్టానుసారంగా యీ పనికి— ట్రాన్స్‌పోర్టువారు వాడుకున్నారట. కర్రలను, రాళ్ళనూ బస్సుల్లో వేసుకుని, హాస్టళ్ళ వైపు పరుగులెత్తారట ఈ రెండు పక్షాలకూ చెందని వారిని కూడా ట్రాన్స్‌పోర్టువారు చావ తన్నారుట. కొన్ని స్కూటర్లు, కార్లూ తగలేశారు.

సోమవారం రాత్రి 10—30 ప్రాంతంలో సుమారో రెండు వందలమంది పనివారు దుర్భాషలాడుతూ కుర్రాళ్లమీద విరుచుకుపడ్డారనీ, అంతలో మరో నాలుగు బస్సుల పనివాళ్ళు వచ్చి చేరారనీ, పోలీసులు మధ్యన నిలిచి తన్నులాట కాకుండా చాలాసేపు వారించారట కానీ, ఒకరు యిద్దరు పనివారు పోలీసువారిని ఏమార్చి హాస్టల్లోకి జొరపడ్డారట వారిద్దర్నీ విద్యార్థుల తన్నారట ఒకతను చావు తన్నులతో కాస్సేపటికి బయటికి వచ్చాడట మరొకతను రానేలేదట ఆ తరువాత స్పృహపోయిన అతన్ని ఆసుపత్రిలో చేరుస్తే— చనిపోయాడట.

అసలీ రభస ఎలా వచ్చిందంటే అందరూ తలోకమాదిరీ చెపుతున్నారు 7—సి బస్సులో కండక్టరు సీటులో వో విద్యార్థి కూర్చున్నాడట. కండక్టరు అతన్ని లేవమన్నాడట విద్యార్థి తనకు ఆరోగ్యం సరిగా లేదని లేవడానికి నిరాకరించాడట. ఒక స్త్రీ కోసం ఆ సీటు ఖాళీ చెయ్యమన్న కండక్టరు కోపంతో అతన్ని తన్నాడన్నారు కొందరు లేదు విద్యార్థే తన్నాడన్నారు మరికొందరు. మొత్తానికి తన్నులాట జరిగింది.

ఇలా ప్రారంభమయిన యీ రభసలో పూరంతా సర్వనాశనమై కళావిహీనంగా తయారయ్యింది. ఏది ఏమైనా తమ పనులకోసం, పగలకోసం ప్రభుత్వపు బస్సులు తీసుకుని విద్యార్థుల హాస్టళ్ళకు వెళ్ళడం అనేది అంత సమంజసం కాదు. ప్రభుత్వం యింకా తన నిర్ణయాన్ని బయట పెట్టలేదు.

ఒక అమాయక విద్యార్థిని చంపి ట్రాన్స్‌పోర్టువారు ప్యారిసు ప్రాంతంలో నడి రోడ్డుమీద పడేశారనీ, ప్రతీకారంగా విద్యార్థులు ఒక కండక్టర్ని చంపి, లా కాలేజీ ప్రాంతంలో చెట్టుకు వ్రేలాడదీశారనీ కొందరు చెప్పారు. ఏదిసత్యం, ఏదసత్యం ?

—ఫాలాక్షుడు ●